క్లుప్తంగా

నేడు దుకాణాల నిర్వహణకు వేలం

తిమ్మాపూర్: మండలంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఆవరణలో 2025 సంవత్సరానికి వివిధ దుకాణాల నిర్వహణకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ఈవో అనిల్ కుమార్, చైర్మన్ లక్ష్మణ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభిస్తామని, టెంకాయల దుకాణానికి రూ.50 వేలు, లడ్డూ, పులిహోర విక్రయానికి రూ.50 వేలు, పేలాలు, పుట్నాల అమ్మకానికి, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు రూ.10 వేలు చెల్లించాలని, ఆసక్తిగల వారు ప్రతివేలంకు డిపాజిట్, షెడ్యూల్ ఫారంకు రూ. వంద చెల్లించి షెడ్యూలు ఖరీదు చేసి వేలంలో పాల్గొనాలన్నారు. వేలానికి ముందు షరతులు తెలియజేస్తామని వెల్లడించారు.

ఆహ్వానపత్రిక అందజేత

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామంలో మార్చి 3 నుంచి 6వ తేదీ వరకు జరిగే భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి, పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాల్సిందిగా కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ బాబు, వెలిచాల రాజేందర్‌రావును ఆహ్వానించినట్లు గ్రామస్తులు తెలిపారు. 70 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మల్లేశం

మానకొండూర్: ప్రతి మత్స్యకారుడు ఎన్‌ఎఫ్‌డీలో సభ్యత్వం పొందాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కరీంనగర్ జిల్లా వైస్ చైర్మన్ పెసరు కుమారస్వామి ముదిరాజ్ అన్నారు, మండలంలోని అన్నారం గ్రామంలో సంఘం కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు మత్స్యకారులు పొందాలంటే ఎన్‌డీపీ సర్టిఫికెట్ తప్పనిసరి పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ పప్పు సమ్మయ్య, ఉపాధ్యక్షుడు కొలిపాక కొమురవెల్లి, ప్రధాన కార్యదర్శి కొలిపాక ప్రవీణ్, డైరెక్టర్లు పప్పు ఓదెలు, పూసాల మల్లేష్, పప్పు సమ్మయ్య, రమేష్ పప్పు మల్లేష్, పూసాల రాజు, పప్పు రాములు కొలిపాక ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం సభకు రండి



మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి సభకు నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో హుజూరాబాద్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ మంజూరుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాంగ్రెస్ బలోపేతం చేస్తే, బీజేపీ ప్రైవేటీకరణ చేస్తూ నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సోమవారం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

జమ్మికుంట: పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్‌లో దుర్గా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్‌కుమార్‌గౌడ్, డాక్టర్ రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కీళ్లు, ఎముకలకు సంబంధించి వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ ఎనిమిదో డివిజన్ పరిధి అలుగునూర్ డివిజన్ కార్యాలయంలో సిద్ధి ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అలుగునూర్‌కు చెందిన డాక్టర్ వైవీ.రమణారెడ్డి రేడియాలజిస్ట్, ఆయన సతీమణి డాక్టర్ వై.జ్యోతి, ఆప్తమాలజిస్ట్ పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన మున్సిపల్ సిబ్బంది, డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌కల్చరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిగ్రీ గెస్ట్ లెక్చరర్లు ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కరీంనగర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ఆటో రెన్యూవల్, కన్సాలిడేటెడ్ పేమెంట్ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జానపట్ల కిశోర్‌రెడ్డి, సుదామ, అపర్ణ, తిరుపతి, సరిత, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

చివరికి చేరని నీరు..

- ఎంఎంఆర్ 4 ఎల్ ఉపకాలువకు నెలన్నర కిందట సాగునీరు విడుదల
- అడ్డుకట్టలు, గండ్లు పెడుతున్న కాలువ ముందు భాగంలోని రైతులు
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు
- ఒకటి, రెండు తడుల కోసం ఎదురుచూపు



కాలువకు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన గండి



చెంజర్ల సమీపంలోని గుట్ట వద్ద చెత్తాచెదారంతో ఎంఎంఆర్ 4 ఎల్ ఉప కాలువ

మానకొండూర్: ఎంఎంఆర్ 4 ఎల్ ఉపకాలువ పరిధిలోని పొలాలకు అధికారులు సాగునీరు విడుదల చేసి నెలన్నర రోజులు గడిచినా ఇంతవరకూ చివరి ఆయకట్టుకు చేరడం లేదు. కాలువ ముందు భాగంలోని రైతులే నీటిని తరలించుకుపోతుండటంతో చివరి ఆయకట్టు రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాలువ ద్వారా ఒకటి, రెండు తడులకు సాగునీరు అందుతుందని భావించిన రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. రాత్రివేళ కాలువ ముందు భాగంలోని రైతులు గండ్లు పెట్టడం లేదా పైపులు వేసి నీటిని తరలిస్తున్నారు. మండల పరిధిలోని చెంజర్ల, ఖాదర్‌గూడెం, నిజాయితీగూడెం, పెద్దూర్‌పల్లె గ్రామాలు మెట్ట ప్రాంతంలో ఉండటంతో చెరువు, కుంటలే ఆధారం. గతంలో ఆరుతడి పంటలే సాగయ్యేది, అయితే తోటపల్లి రిజర్వాయర్ ద్వారా చిగురుమామిడి, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లోని మెట్ట భూములకు సాగునీరు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాలువల నిర్మాణం చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ఎంఎంఆర్ 4 ఎల్ ప్రధాన ఉపకాలువ పూర్తయింది. ప్రధాన కాలువ పూర్తవడంతో సాగునీరు విడుదల చేసి చెరువు, కుంటలు నింపి సంబరాలు చేశారు. కాలువల ద్వారా నీరు వస్తుందనే ఆశతో రైతులు ఆరుతడి పంటలు కాకుండా వరి, ఇతర పంటలు జోరుగా సాగుచేశారు. ఎక్కడికక్కడ రైతులు సాగునీటిని తరలించుకుపోతున్నారు. కాలువల ద్వారా నీరు రావడం లేదని, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో చెత్తాచెదారం ఏపుగా పెరగడంతో సాగునీరు వెళ్లేందుకు అడ్డంకిగా మారింది. మా పంటలు పండితే చాలు అన్నట్టు కాలువ ముందు భాగం రైతులు నీటిని తరలించుకుపోతుంటే చివరి ఆయకట్టు రైతులు పంటలు ఎండిపోతాయేమోనని ఆందోళనకు గురవుతున్నారు.

గస్తీ ఉన్నా...అంతే

కాలువల వెంట అధికారులు గస్తీ నిర్వహిస్తున్నా రాత్రివేళ కొందరు కాలువలకు గండ్లు పెడుతున్నారు. వరి, మొక్కజొన్న పంటలు చేతికందే దశలో సాగునీరు అందక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని సాగునీరు చివరి ఆయకట్టుకు అందేలా చూడాలని, రెండు తడులు అందితే పంటలకు డోకా ఉండదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చివరికి నీరు చేరడం లేదు



చెంజర్ల గ్రామ శివారులోని ఎంఎంఆర్ 4 ఎల్ ఉపకాలువ ద్వారా సాగునీరు చివరి భూములకు చేరడం లేదు. కాలువ ద్వారా సాగునీరు వస్తుందని వరి, మొక్కజొన్న వివిధ రకాల పంటలు సాగుచేశాం. కాలువ ముందు భాగంలోని రైతులు సాగునీరు తరలించుకుపోతున్నారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి. – దుడ్డెల రమేశ్, రైతు, చెంజర్ల

చర్యలు తీసుకుంటాం

ఎంఎంఆర్ 4 ఎల్ ఉపకాలువ ద్వారా రైతుల అవసరాలకు సరిపడా సాగునీరు అందేలా చూస్తాం. చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూడాల్సిన బాధ్యత కాలువ ఎగువ భాగాన ఉన్న రైతులదే. చివరి ఆయకట్టు రైతుల పంటలు ఎండిపోకుండా ఉండేలా సాగునీరందించి తగు చర్యలు తీసుకుంటాం.

– సదానందం, డీఈ



హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేటలో శ్మశానవాటిక పక్కన వ్యవసాయబావి ప్రమాదకరంగా ఉంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అంత్యక్రియలు నిర్వహించాల్సివస్తోందని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, ఫోన్ నంబర్: 833004821

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం

హుజూరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని తెలంగాణ జన సమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమగ్ర కుల గణన ద్వారా బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు కృషిచేస్తున్న కాంగ్రెస్‌కు అండగా ఉండాలన్నారు. బీఆరెస్ పార్టీ నిరుద్యోగులకు గత పదేళ్లుగా న్యాయం చేయలేకనే నేడు పోటీ లోంచి తప్పుకుందన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని దుర్గాకాలనీలో నరేందర్‌రెడ్డికి మద్దతుగా టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ చిన్నంట నాగేంద్ర ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు.

గంగాధర: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురమల్ల మనోహర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని రంగరావుపల్లి, మంగపేట, గోపాల్‌రావుపల్లి, కాసారం గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్‌రెడ్డికి వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



చొప్పదండి: రాగంపేటలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



చిగురుమామిడి: సుందరగిరిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

గంగాధర: మండలంలోని కొండన్నపల్లి, న్యాలకొండన్నపల్లి గ్రామ శివారులో నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, కల్యాణోత్సవం ఐదు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. గున్నాల చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు రాజశేఖర్‌లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన శివాలయం ఆవరణలోనే వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. వేదపండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండన్నపల్లి తాజామాజీ సర్పంచ్ రేండ్ల జమునశ్రీనివాస్, రేండ్ల రాజిరెడ్డి, కళింగ శేఖర్, తొరికొండ కిషన్, మామిడి అశోక్, మాజీ జెడ్పీటీసీ ఇప్పలపల్లి సాంబయ్య, రాజు, అంజయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని పొలంపల్లి గ్రామంలో మూడు రోజులుగా నవగ్రహ విగ్రహాలు, ఆంజనేయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మయూరగిరి పీఠాధిపతులు నమిలకొండ రమణాచారి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. కార్యక్రమంలో వేద పండితులు రామకృష్ణమాచార్యస్వామి, పురోహితులు లక్ష్మీనరసింహస్వామి, వినయ్‌స్వామి, వివేక్‌స్వామి, గీతాచార్యులు, ఆకాష్‌స్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు మెంబర్స్, సొసైటీ చైర్మన్, యువకులు మహిళలు ప్రముఖులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో పురాతన శివాలయం ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ సివిల్ ఇంజినీర్, సామాజిక వేత్త జేరిపోతుల బాలచందర్‌జయశ్రీ కుటుంబ సభ్యులు ధ్వజస్తంభం బహూకరించారు. ప్రముఖ జర్నలిస్టు చీకోటి శ్రీనివాస్ రూ.ఇరవై ఐదువేలు విలువ చేసే పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన ప్రముఖులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్‌రమేశ్, రిటైర్డ్ టీచర్ రమణయ్యసత్యవతి పాల్గొన్నారు.

మల్లన్నస్వామి జాతర

మండలంలోని నవాబుపేట్‌లో ఆదివారం మల్లన్నస్వామి జాతర నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం, ఆలయం ఎదుట పట్నాలు, శకటోత్సవం, అగ్నిగుండాల నిర్వహణతోపాటు మల్లన్నస్వామి చరిత్రను ఒగ్గుకళాకారులు కథా రూపంలో వినిపించారు. అనంతరం బోనాలతో నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఇనుగాల శ్రీనివాస్‌రెడ్డి, బోయిని వేణుగోపాల్ పలువురు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాజరాజేశ్వర యాదవ సంఘం అధ్యక్షుడు నర్సయ్య, ఉపాధ్యక్షుడు మర్రి రాజయ్య, ప్రధానకార్యదర్శి ఆసర సంజీవు, డైరెక్టర్లు సీత రాజకొంరయ్య, మర్రి ఐలేశ్, కనుకవ్వ, తిరుమల పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలోని సత్యలక్ష్మీ మాత ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పల్లకి సేవ, ఆలయం నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకూ ఊరేగింపు, ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకం, నీరాజనం, మంత్రం పుష్పం, అన్నదానం చేపట్టారు.

చొప్పదండి: మండంలోని రాగంపేటలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విష్ణు సహస్ర నామ పారాయణం, నిత్య హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ వంశస్థులు, తదితరులు పాల్గొన్నారు.



చిగురుమామిడి: ఆలయం ఎదుట పట్నాలు వేసిన ఒగ్గు కళాకారులు



గంగాధర: శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

గన్నేరువరం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని పార్టీ మండల అధ్యక్షుడు తిప్పారపు నికేశ్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై పోరాడేది బీజేపీ, కాంగ్రెస్‌తో పట్టభద్రులకు ఒరిగేదేమి లేదన్నారు.

గంగాధర: పట్టభద్రులు, ఉపాధ్యాయులు బీజేపీ వైపే ఉన్నారని పార్టీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలో ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొంరయ్యకు వేయాలని సూచించారు.

హుజూరాబాద్: రాష్ట్రంలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్‌కు ఎంతో కీలకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రాజు, కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీజేపీకి దేశంలోనే కాకుండా తెలంగాణలో కూడా బలమైన ఆదరణ లభిస్తుందని, అన్ని వర్గాల ప్రజల ఆదరణతో ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెట్టినా 41 శాతం ఓటు షేర్ సాధించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ ప్రభంజనం కనబడుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టభద్రుల, టీచర్స్ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, బీఆర్ఎస్ పూర్తిగా వారి విశ్వాసాన్ని కోల్పోయిందని అందుకే పోటీ చేయలేని పరిస్థితికి వచ్చిందన్నారు. అలాగే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనతి కాలంలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకత మూట గట్టుకుందన్నారు. పట్టభద్రులు, టీచర్స్ బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య ను భారీ మెజారిటీతో గెలిచే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట గ్రామంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2000–01 పదో తరగతి విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సంతోషంగా గడిపారు. చదువు చెప్పిన గురువులు రాజిరెడ్డి, సురేందర్, రాజిరెడ్డి, హరికిషన్, శ్రీవాణి, గట్టు వెంకటస్వామిని ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుమ్మం తిరుపతి, కొక్కిస సత్యనారాయణ, కొత్తపల్లి సంతోష్, పిల్లి సంపత్, కాశపాక బాబు, కె. శ్రీనివాస్‌రెడ్డి, కె. వేణు, శ్యామల, శ్రీలత, సరిత, రమాదేవి పలువురు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన నాయకులు



చెరువును పరిశీలిస్తున్న నాయకులు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో డీ 8 కాలువ ద్వారా ఊర చెరువులో నీరు నింపేందుకు మండలంలోని నాయకులు ఆదివారం కాలువను పరిశీలించారు.కాలువ ద్వారా చెరువును నింపాలని గ్రామస్తులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కోరగా మండలంలోని నాయకులు కాలువతో పాటు చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రాములు, మార్కెట్ డైరెక్టర్ నర్సయ్య, మాజీ సర్పంచ్ గవ్వ వీరయ్య, పురంశెట్టి బాలయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, నాయకులు సతీశ్‌రెడ్డి, బండి మహేశ్, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నూకల రవి, రాజుకుమార్ పాల్గొన్నారు.

సంత్ గార్గే బాబాకు నివాళి

కరీంనగర్‌టౌన్: స్వచ్ఛభారత్ సృష్టికర్త సంత్ గార్గే బాబా జయంతి వేడుకలను ఆదివారం నగరంలోని కోర్టు చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గార్గేబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమాజం, స్వచ్ఛత ఆలోచన చేసిన గొప్ప వ్యక్తి అన్నారు.